దేవరపల్లి హైవే పనులను.. ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తాం : మంత్రి తుమ్మల

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం – దేవరపల్లి హైవే నిర్మాణ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని అల్లిపురం – ధంసలాపురం మధ్యలో గల దేవరపల్లి హైవేపై సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మానికి అనుసంధానంగా ఖమ్మం – దేవరపల్లి, నాగ్‌పూర్ – అమరావతి, ఖమ్మం – కొరివి హైవేల నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిలో ఖమ్మం – దేవరపల్లి హైవే నిర్మాణాన్ని 2025 ఏప్రిల్‌లోగా పూర్తి చేస్తామన్నారు. రూ.7 వేల కోట్లతో మూడు ప్యాకేజీలుగా చేపట్టిన నాగ్‌పూర్ – అమరావతి హైవే ప్రాజెక్టు పనులు త్వరలోనే ఖమ్మంలో ప్రారంభమవుతాయని అన్నారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఖమ్మం చుట్టూ ఓటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రఘునాథపాలెంలో సాగును గణనీయంగా పెంచాలనే ఉద్దేశంతో ఎన్నెస్పీ కెనాల్‌పై లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకుగాను ఆ శాఖ మంత్రితో చర్చించి రూ.66.33 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌తో మండలంలోని 30 చెరువులకు నీరందుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తాం

రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరాటౌన్, నవంబర్ 11: ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని, క్రీడలకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం వైరా సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో పదో జోనల్‌స్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ 2024ను ఆయన స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ గురుకులాలు భవిష్యత్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలుగా మార్చి అవసరమైన నైపుణ్యాలను అందిస్తామన్నారు. విద్యార్థులు అన్ని అవకాశాలను ఉపయోగించుకొని క్రమశిక్షణతో ఎదగాలని ఆకాంక్షించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పం

ఖమ్మం రూరల్, నవంబర్ 11: రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి మండలంలోని చిన్న వెంకటగిరిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఏదులాపురం పంచాయతీ టీఎన్‌జీఓస్ కాలనీలో నూతన సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని 37మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

'విన్‌ఫీల్డ్'లో ఉచిత కంటి వైద్య శిబిరం

విద్యార్థులకు కంటి వైద్య పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 11: నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200మందికి కంటి పరీక్షలు చేసి.. సమస్యలున్న వారికి తగు సూచనలు చేశారు. చికిత్స అవసరమైన వారికి అందుకు తగిన సలహాలు అందించారు. అనంతరం కంటి చూపు సంరక్షణ, ఆహార పదార్థాల వివరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిశోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముదిరాజ్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా మహేశ్

రఘునాథపాలెం, నవంబర్ 11: తెలంగాణ ముదిరాజ్ జేఏసీ జిల్లా కమిటీ సమావేశం నగరంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగింది. రాష్ట్ర సంఘం చైర్మన్ పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా తురక మహేశ్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మహేశ్‌కు అందజేశారు. జిల్లాలో ముదిరాజ్ జేఏసీ సంఘం అభ్యున్నతి కోసం పాటుపడుతానని మహేశ్ పేర్కొన్నాడు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సత్తుపల్లి బ్రాంచ్ వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **సయ్యద్ ముంతాజ్ బేగం**, W/O. **జహీర్**, వయస్సు : 47 సం||లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : 3-4, మసీద్ రోడ్, వేంసూరు గ్రామం, వేంసూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు వార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర ఆభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రార్, జిల్లా పరిషత్ ఖమ్మం, వేంసూరు మండల పరిషత్, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, వేంసూరు గ్రామ పంచాయితీ మరియు వేంసూరు గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా వేంసూరు గ్రామంలో వున్న 172.91 చ||గ.ల స్థలము మరియు అందు నిర్మించియున్న ఇ.నెం. 3-4వ నెంబరు (అస్సెస్‌మెంట్ నెం. 498) గల ఆర్.సి.సి. బిల్డింగ్, ఎదుట వైపు రేకుల వసారా, లెట్రిన్ బాత్రూమ్, మంచి నీటిపంపు, కరెంట్ సర్వీస్, నాలుగు వైపుల ప్రహరీ గోడతో యుక్తంగా **డాక్యుమెంట్ నెం.** : **2256/2024** గల ఆస్తికి హద్దులు : **తూర్పు** : గ్రామ పంచాయితీ రోడ్డు, ఆస్తి కొలత 24.9 అడుగులు, **దక్షిణము** : గిృహపరిచినవారి స్వంత స్థలము, ఆస్తి కొలత 62.5 అడుగులు, **పడమర** : సయ్యద్ షబ్బీర్ గారి ఇల్లు, ఆస్తి కొలత 24.9 అడుగులు, **ఉత్తరము** : మహమ్మద్ యాకూబ్ గారి ఇల్లు, ఆస్తి కొలత 62 అడుగులు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

రఘునాథపాలెం, నవంబర్ 11: ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై ఖానాపురం హవేలీ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. కారేపల్లి మండలానికి చెందిన ఓ బాలిక (17) ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. దీపావళి సెలవులకు ఇంటికి వెళ్లిన ఆ బాలికను ఆమె తండ్రి ఆదివారం తీసుకొచ్చి కళాశాల హాస్టల్లో చేర్పించాడు. కాగా, సదరు యువతి అదే రోజు సాయంత్రం హాస్టల్ నుంచి కనిపించకుండా పోయింది. దీనిపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శివాలయాల్లో కార్తీక శోభ

కూసుమంచి: శివలింగాకారానికి అభిషేకం చేస్తున్న భక్తులు

సత్తుపల్లి: పుట్టకు పాలు పోస్తున్న మహిళలు

కూసుమంచి, నవంబర్ 11: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కూసుమంచిలోని శివాలయంలో రెండో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆయల ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. శివుడికి పంచామృతాలతో అభిషేకం చేశారు. శివాలయం ప్రాంగణంలోని లింగాకారం వద్ద భక్తులు పాలు పోసి అభిషేకం చేశారు. పూజారి దేవులపల్లి శేషగిరిశర్మ అభిషేకాలు చేశారు. ఈవో కాముని శ్రీకాంత్, విజయలక్ష్మి,ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజారి రంగబాలాజీ పూజలు చేశారు.

సత్తుపల్లి, నవంబర్11: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని సోమవారం మహిళలు తెల్లవారుజామున లేచి కార్తీక స్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని మెట్టాంజనేయస్వామి, కాకర్లపల్లి శివాలయం, బేతుపల్లి శివాలయం తదితర ప్రాంతాల్లో పుట్టలకు పాలుపోసి మొక్కులు చెల్లించారు.

సమగ్ర కుటుంబ సర్వేపై ప్రచారం

బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

సత్తుపల్లి: సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, నవంబర్ 11: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఖమ్మంపాటి వెంకటేశ్ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్, ప్రధాన కూడళ్లలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే పట్ల ప్రజలు అధికారులకు సహకరించేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సర్వే అధికారులు తమ ఇళ్లను సందర్శించినప్పుడు వారికి సహకరించాలని, నిర్భయంగా, నిర్భయంతరంగా సమాచారం అందించాలని సూచించారు.

సత్తుపల్లి, నవంబర్ 11: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం కల్లూరు మండలం లింగాలలో అధికారులు చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఏఎంసీ చైర్మన్ నీరజ, వైస్‌చైర్మన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా కుల గణన సర్వే

కూసుమంచి, నవంబర్ 11: మండలంలోని నర్సింహులగూడెం, చౌటపల్లి, పాలేరు తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎలాంటి అపోహలకు అవకాశాలు లేవని కుటుంబాలకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోరారు.

ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే

కొణిజర్ల, నవంబర్ 11: మండల పరిధిలోని తనికెళ్ల, గోపవరం, లింగగూడెం గ్రామాల్లో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో రోజారాణి, ఎంపీవో రాజేశ్వరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు సర్వేపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన అధికారులు

బోనకల్లు, నవంబర్ 11: మండలంలోని గార్లపాడు, గోవిందాపురం-ఎల్, తూటికుంట్ల గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అధికారులు సోమవారం పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలను ఎలా సేకరిస్తున్నారు అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎంపీడీవో ధరావత్ రమాదేవి, ఎంపీవో శాస్త్రి, ఎంఈవో దామాల పుల్లయ్య, గిరిధావర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఆర్జేసీ విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో ఆర్జేసీ కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 11: నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ సోమవారం తెలిపారు. అకాడమర్, టీచ్‌నూక్ సంస్థ నిర్వహించిన ప్రక్రియలో ఐదుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. ఎంపికై విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్ లింగయ్య, అధ్యాపకులు అభినందించారు.

ఖమ్మంలో ప్రైవేటు ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

మామిళ్లగూడెం, నవంబర్ 11: ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం స్టేషన్ ఫైర్ అధికారి నాగరాజు కథనం ప్రకారం.. నగరంలోని వైరా రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీలో నుంచి మంటలు వచ్చాయి. దీంతో ఒక్కసారిగా ఆసుపత్రిలోని రోగులు, సిబ్బంది ఒక్కసారిగా హడలిపోయారు. వెంటనే అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది.. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

వైరాటౌన్, నవంబర్ 11: ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వైరాలో కలిసి వినతిపత్రం అందజేశారు. గౌరవరపు డేవిడ్‌రాజు, వేముల గోపాలరావు, సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్, షేక్ లాల్‌మియా, ఓర్సు శ్రీనివాసరావు, సయ్యద్ అతావుల్లా, మిట్టపల్లి రాఘవరావు, వెంకటకృష్ణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపరచాలి

బోనకల్లు, నవంబర్ 11: మండలంలో ప్రభుత్వ వైద్యసేవలు మెరుగుపరచాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్ సోమవారం జరిగిన ప్రజావాణీలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. పీహెచ్‌సీలో ప్రత్యామ్నాయ వైద్యసేవలు అందించేలా కృషి చేయాలని కోరారు. రక్తపరీక్షల ఫలితాలను ఆ రోజే అందజేయాలని కోరారు.

పాముకాటుకు గురై రైతు మృతి

కారేపల్లి, నవంబర్ 11: పాము కాటుకు గురై రైతు, బీఆర్ఎస్ నాయకుడు మృతిచెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉసిరికాయలపల్లికి చెందిన పొడుగు బుచ్చిరాములు (45) గ్రామ సమీపంలోని తన వ్యవసాయ భూమిలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య హైమావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 18 తుది గడువు'

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 11: 2025 మార్చిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు షెడ్యూల్ విడుదలైనట్లు డీఈవో సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 వరకు ఎలాంటి ఫైన్ లేకుండా చెల్లించవచ్చునని, రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని వివరించారు.

వరద బాధిత హెచ్‌సీ కుటుంబానికి సాయం

మామిళ్లగూడెం, నవంబర్ 11: ఖమ్మం నగరంలో ఇటీవలి వరదల కారణంగా జిల్లా సాయుధ దళం హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) నాగేశ్వరరావు ఇల్లు నీటిలో మునిగింది. ఇంట్లోని సామాన్లు దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న సహచర 1998 బ్యాచ్ కానిస్టేబుళ్లు సేకరించిన రూ.65 వేలను సోమవారం అందజేశారు. కందుకూరి ప్రేమ్‌చందర్, రవీందర్, సోమయ్య గోలి రాజు,శ్రీనివాస్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 11: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు డీఈవో సోమశేఖరశర్మ, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్‌లో 342 మంది విద్యార్థులకు గాను 182 ఉత్తీర్ణత సాధించారని అన్నారు. అలాగే, ఓపెన్ ఇంటర్‌లో 380 మంది విద్యార్థులకు గాను 216 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు.

'మున్నేరు' స్కూళ్ల మరమ్మతులపై నేడు సమీక్ష

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 11: ఇటీవల మున్నేరు వరదల ధాటికి ధ్వంసమైన ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులపై నూతన డీఈవో కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆయా పాఠశాలలకు తక్షణ అవసరంగా కల్పించాల్సిన సదుపాయాలు, మౌలిక వసతులపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో అదనపు కలెక్టర్, డీఈవో సమీక్షించనున్నారు. తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోనున్నారు. మొత్తం 17 స్కూళ్లను మున్నేరు ప్రభావిత పాఠశాలలుగా గుర్తించారు. ఆయా స్కూళ్ల హెచ్ ఎంలను పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

బీటలు వారిన ఇళ్లకు పరిహారం అందించాలి

ముదిగొండ, నవంబర్ 11: హైవే రోడ్డు నిర్మాణంలో గుట్ట బ్లాస్టింగ్ చేయడంతో బీటలు వారిన ఇండ్లకు నష్టపరిహారం ఇవ్వాలని సోమవారం ప్రజావాణీలో స్థానికులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. హైవే నిర్మాణం పూర్తికావస్తున్నా తమకు పరిహారం అందలేదనీ ఇప్పుడు కాంట్రాక్ట్ సంస్థను అడిగితే పరిహారం అందరికీ ఇచ్చామని చెపుతున్నారని అన్నారు. సంస్థపై చర్యలు తీసుకుని పరిహారం అందించాలని స్థానికులు కోరారు.

సాధిక్‌అలీ కుటుంబానికి పరామర్శ

నివాళి అర్పిస్తున్న బాల్యమిత్రులు

పెనుబల్లి, నవంబర్ 11: కల్లూరులో తోపుడుబండి అధినేత సాధిక్ అలీ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆయన బాల్యమిత్రులు సోమవారం కల్లూరు వచ్చి సాదిక్‌అలీ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సాదిక్‌అలీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. నివాళి అర్పించిన వారిలో సీహెచ్ నర్సింహారావు, లక్ష్మణ్ రావు, పెద్దబోయిన దుర్గాప్రసాద్ ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం, నవంబర్ 11: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, దీపోత్సవం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. శ్రీవారి కోనేరు వద్ద కార్తీక దీపోత్సవం, గంగాహారతి పూజలు జరిపారు. ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప్పల శ్రీనివాస్, ఎం.వెంకటరమణ, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలకు నీరివ్వరూ..

ఎంపీడీవోను కోరిన పద్మశ్రీ వనజీవి రామయ్య

ఎంపీడీవోకు మొక్కను అందిస్తున్న వనజీవి పద్మశ్రీ రామయ్య

ఖమ్మం రూరల్, నవంబర్ 11: రెడ్డిగూడెంలోని ప్రభుత్వ స్థలంలో నాటిన శ్రీగంధం మొక్కలకు, ముత్తగూడెం నుంచి పల్లెగూడెం వరకు సాగర్ కాల్వ పక్కన నాటిన మొక్కలకు నీరులేక ఎండిపోతున్నాయని, వాటికి నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పద్మశ్రీ వనజీవి(దరిపెల్లి) రామయ్య ఎంపీడీవో ఎస్.కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కలిసిన రామయ్య ఆయనకు మొక్క, జ్ఞాపికను అందజేశారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడిన రామయ్య.. శిథిలావస్థకు చేరిన తన ఇంటిని తొలగించానని, ప్రస్తుతానికి ఒక గదిలో ఉంటున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఒకటి రెండు రోజుల్లో మొక్కలను పరిశీలించి, వాటికి నీటి సరఫరా జరిగే విధంగా పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఇంటి నిర్మాణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు.

కంపెనీ ఏజెన్సీ అగ్రిమెంట్ ఇవ్వాలి

ఆయిల్‌పాంను పరిశీలిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

కొణిజర్ల, నవంబర్ 11: రైతులు ఎవరూ కంపెనీ ఏజెన్సీ అగ్రిమెంట్ లేకుండా మొక్కజొన్న విత్తనాలు వేసుకోవద్దని వైరా ఏడీఏ కరుణశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని సింగరాయపాలెంలో విత్తన మొక్కజొన్న వేసే రైతులు, ఏజెంట్లతో ఆమె మాట్లాడారు. విత్తన మొక్కజొన్న వేసే ప్రతిరైతు అగ్రిమెంట్ తప్పకుండా ఇవ్వాలని, డిసెంబర్ మొదటి వారం తర్వాత విత్తన మొక్కజొన్న వేసుకోవద్దని సూచించారు. ఆలస్యంగా విత్తన మొక్కజొన్న వేసుకుంటే విత్తనం తయారు సమయానికి ఉష్ణోగ్రతలు పెరిగి పంట దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. అనంతరం గుండ్రాతిమడుగులో ఎస్.మహబూబ్, ఎస్.కే.జానీ వేసిన ఆయిల్‌పాం మొక్కలను పరిశీలించారు. ఏవో బాలాజీ, గోద్రేజ్ ఫీల్డ్‌ఆఫీసర్ దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, నవంబర్11: మండలంలోని లంకపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు.

వేంసూరు, నవంబర్ 11: మండలంలోని వెంకటాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నరకం వరి ధాన్యం కేంద్రాన్ని సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు.

వేధింపులకు పాల్పడితే 100కు ఫిర్యాదు చేయాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మధిర, నవంబర్ 11: మహిళలు, బాలికలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని మధిర పట్టణ ఎస్సై ఎన్ సంధ్య సూచించారు. మంగళవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు 'వేధింపులు-సైబర్ క్రైం'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎవరైనా వేధించినా, రోడ్లపై వెళ్లేటప్పుడు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా వెంబడించినట్లైతే 100కు ఫిర్యాదు చేయాలని అన్నారు. పాఠశాల విద్య చాలా ముఖ్యమైందని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవడానికి మంచిగా చదువుకోవాలని సూచించారు. యువ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర అంశాల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రావూరి ప్రకాశ్‌రావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతి అమ్మవారికి వెండిపాదాలు బహూకరణ

బోనకల్లు, నవంబర్11: మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో మలినాథ మహానాగ శివాలయంలో ఉన్న పార్వతి అమ్మవారికి దొంతినేని ప్రసాద్- కళావతి దంపతులు సోమవారం వెండి పాదుకలను అందజేశారు. ఆలయ పండితులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్ప